క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాన్నదానం



అన్నదానం చేస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: పోర్టు వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 22న పాలిక విసర్జనతో 16 రోజుల పండగ ముగుస్తుందని ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు విజయవంతం చేసిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉరుకూటి



ఉరుకూటి శ్రీనివాసరావు

అల్లిపురం: ఏసీఎఫ్ పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా నగరానికి చెందిన ఉరుకూటి శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు దాసరి రాంబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా రామ్ సహాయం జయ సింహారెడ్డి (ఖమ్మం)ని నియమించినట్లు పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

దాబాగార్డెన్స్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించిన వారికి, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. దాదాపు 200 మంది ఓపీకి హాజరు కాగా, 44 మందికి ఆపరేషన్ చేయాల్సి ఉందని గుర్తించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులను పరామర్శించి వస్త్రదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివేకానంద సంస్థ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైజ్ అధికారులు

విశాఖ సిటీ : నగరంలో అనధికారికంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ సూపరింటెండెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి 20 వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాణిపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చావుల మదుం దగ్గర అక్రమంగా డిఫెన్స్ మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ ఆదేశాలతో ఏఈఎస్ టి.రాజశేఖర్ సమక్షంలో సీఐ రవికిరణ్, ఎస్సై ముసలనాయుడు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాపు మురళీమోహన్ (38) అనే వ్యక్తి డిఫెన్స్ మద్యం విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పట్టుకున్నారు. నిందితుడు నావెల్ డాక్‌యార్డ్‌లో 15 ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి ఉన్న పరిచయాలతో మద్యం బాటిళ్లను సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మురళీమోహన్‌పై మహారాణిపేట ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అపారిశుద్ధ్యంతో అవస్థలు



కేరళ మసీదు వద్ద అధ్వానంగా ఉన్న కల్వర్టుపై పలకలు



జీవీఎంసీ 33వ వార్డు గోవింద్‌రోడ్డు, వేంకటేశ్వరస్వామి ఆర్చి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు, అధ్వానంగా ఉన్న చెత్తడబ్బా



లక్ష్మీనగర్, కేరళ మసీదు వద్ద ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన స్టాపర్



కేరళ మసీదు వద్ద కాలువలో తీసిన పూడికలు ఎత్తకపోవటంతో నిలువ ఉన్న కుప్పలు



ద్వారం వద్ద నిలిచిపోయిన మురుగునీరు

- 33, 34 వార్డుల్లో పారిశుధ్యం గల్లంతు
- కల్వర్టులు దెబ్బతిన్నా మరమ్మతులు నాస్తి
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

అల్లిపురం: పరిశుభ్రతకు మారుపేరుగా విశాఖ నగరాన్ని అభివృద్ధి చేస్తామన్న నగరపాలక సంస్థ అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలాయని ప్రజలు అనుకుంటున్నారు. జీవీఎంసీ 33వ వార్డు పరిధి గోవింద్‌రోడ్డులో రోడ్డుపైనే మురుగు ప్రవహించడం, అక్కడే చెత్త డబ్బా వద్ద చెత్త నిల్వలు, రోడ్డుపై నిలిచిపోయిన మురుగుతో అధ్వానంగా మారింది. దీంతో ఆ రహదారి గుండా ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

34వ వార్డులో..

34వ వార్డు లక్ష్మీనగర్‌లో కాలువపై పలకలు పాడవటంతో రెండు నెలలుగా జీవీఎంసీ సిబ్బంది తవ్వి వదిలేశారు. కాలువలో చెత్తను తొలగించేందుకు మ్యాన్‌హోల్‌పై మూత తప్పించారు. తిరిగి దాన్ని ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురికావటంతో స్థానికులు మ్యాన్ హోల్‌పై స్టాపర్ పెట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయమై వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పలుమార్లు పారిశుధ్య సిబ్బందికి తెలియజేసినా కనీసం పట్టించుకోలేదు.

పలుమార్లు ఫిర్యాదు చేసినా ..

కాలువపై పలకలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయమని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కార్పొరేటర్‌కి కూడా చెప్పాం. అయినా ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు.
– యు.రామయ్యమ్మ, భూపేష్‌నగర్

ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది..

గోకుల్ రోడ్డులో వెంకటేశ్వరమెట్ట ఆర్చి వద్ద మురుగు కాలువ లేకపోవటంతో రోడ్డుపైనే మురుగు నిలిచిపోతుంది. దీని వల్ల ప్రయాణం కష్టంగా ఉంది. దానికి తోడు చెత్త డబ్బాలు రోడ్డుపైనే పెట్టడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే కాలువ నిర్మించాలి.
– బొడ్డేటి ప్రసాద్, వెంకటేశ్వరమెట్ట

స్టాపర్ ఏర్పాటు చేశాం..

లక్ష్మీనగర్, కేరళ మసీదు వద్ద రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్‌పై మూత లేకపోవటంతో ప్రమాదకరంగా మారింది. ప్రతి రోజు ఎవరో ఒకరు పడిపోతున్నారు. ప్రమాదాల నివారణకు మేమే మ్యాన్‌హోల్‌పై స్టాపర్ ఏర్పాటు చేశాం.
– ఆర్.నారాయణరావు, జెండా చెట్టు వీధి.

కొత్త పని మంజూరు అయింది

కేరళ మసీదు వద్ద కొత్త పని మంజూరు అయింది. అందువల్ల పని చేయడం లేటు అవుతోంది. త్వరలోనే పనులు మొదలు పెడతాం. కాంట్రాక్టర్‌ని నియమించారు. ఫాలో అప్‌లో ఉన్నాం. సమస్య పరిష్కారమవుతుంది.
– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

బాలుడి ఫీజుకు వాసుపల్లి ఆర్థిక సాయం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 1,70,467 మందికి అమ్మఒడి అమలు
- నేడు తల్లికి వందనంలో లక్షకు పైగా అర్హులకు మొండిచేయి
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఎంత మంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చి, లక్ష మందికి పైగా అనర్హులను చేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ విమర్శించారు. 39వ వార్డు పాతపోస్టాఫీస్ ప్రాంతానికి చెందిన రెహానా బాషా స్కూల్ ఫీజుకి శనివారం ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో రూ.5 వేలు సాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం హడావిడిగా ప్రారంభించి, లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత విధించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 1,70,467 మందికి అమ్మ ఒడి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో మూడు లక్షల నుంచి మూడున్నర లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని భావించారన్నారు. కానీ రూ. 12,000 జీతం దాటిన వారికి, 300 యూనిట్ల కరెంటు బిల్లు, ఆస్తులు లేని వారికి ఆస్తులు ఉన్నట్టుగా చూపించి అర్హులైన లక్ష మందికి పైగా విద్యార్థులకు తల్లికి వందనంలో కోత విధించారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు పథకాలు అమలు చేయలేక, మభ్యపెడుతూ అర్హులైన పేదవాడి ఉసురు పోసుకుంటున్నాడని తెలిపారు. నాడు జగనన్న బడి ఈడు పిల్లలకు అమ్మ ఒడి, కళాశాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు అందజేసి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చి ఆంధ్రప్రదేశ్‌ను అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఏడాదిలోనే విసుగు చెందిన ప్రజలు మళ్లీ జగనన్న సుపరిపాలనను కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో 39వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు ముజీబ్‌ఖాన్, 30వ వార్డు నాయకుడు దశమంతుల మాణిక్యాలరావు, సన్యాసిరావు, తాడి రవితేజ, వేణు, సత్య, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న క్యాడెట్లు

దాబాగార్డెన్స్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, సిబ్బంది రక్తదానం ప్రాముఖ్యత, ప్రజల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ రక్తదానం ఇంకొకరి ప్రాణాన్ని కాపాడగలదని, ఆరోగ్యవంతమైన యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి, జేకేసీ మెంటార్ రాజు, కాంటిజెంట్ లీడర్ ఎస్. దీపిక, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలు..

జైభీమ్ సంస్థ ఆధ్వర్యంలో కేజీహెచ్ ఓపీ గేటుకు ఎదురుగా మైక్రో ల్యాబ్స్‌లో లయన్స్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

కార్యక్రమంలో న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ రమేష్ బాబు, జై భీమ్ సంస్థ కన్వీనర్ కోన ప్రకాష్, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, కేవీఎస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోన శంకర్, మైక్రో ల్యాబ్స్ అధినేత ఉంగరాల ఈశ్వర్, ఆదరణ క్రికెట్ అకాడమీ కోచ్ సూర్య ప్రకాష్, భూపతి రావు, శ్రీనివాస్, కనకరాజు, లవకుశ, జయరాజ్, సుశీల, సంధ్య, చంద్రకళ, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 11 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో శనివారం రైల్వే పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. తమిళనాడు కన్యాకుమారి జిల్లాకు చెందిన అలమీన్, అజిత్ అయ్యప్పన్‌లు విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా తమిళనాడుకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించి వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.55 వేల విలువైన 11 కేజీల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

త్వరలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలు



డాక్టర్ శ్రీహరిరావును సన్మానిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు

మహారాణిపేట: ఆన్‌లైన్ సేవలను అభివృద్ధి చేశామని, త్వరలో వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించి వైద్యులు తమ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడమే కాకుండా, ఫీజు కూడా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు అన్నారు. శనివారం ఆంధ్ర వైద్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రెన్యువల్, రీ-రిజిస్ట్రేషన్, ఎన్‌వోసీ, గుడ్ స్టాండింగ్ సేవలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలి సభ్యులు, రిజిస్ట్రార్ సిబ్బంది సహకారంతో రెండవ జిల్లా కేంద్ర కార్యక్రమాన్ని ఇక్కడ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో రెన్యువల్ సమయం పూర్తయిన తర్వాత మాత్రమే రిజిస్ట్రేషన్ చేసేవారని, దేశంలో మొట్టమొదటి సారిగా అన్ని జిల్లా కేంద్రాల్లో వైద్య మండలి ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన విజయనగరం జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రోజు విశాఖలో రెండవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అంతే కాకుండా ఒకసారి మాత్రమే వైద్య మండలికి వచ్చి వారి వేలిముద్ర, సంతకం, ఐరిస్‌లను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తామని, జీవితంలో మళ్లీ వైద్య మండలికి రావాల్సిన అవసరం ఉండదని, ఆ తర్వాత వారు ఆన్‌లైన్ ద్వారా రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య మండలి సభ్యులు డాక్టర్ కేశవరావుబాబు, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు. శ్రీహరి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జె.సి. నాయుడు, అసోసియేషన్ నాయకులు డాక్టర్ పి.జె. శ్రీనివాస్, డాక్టర్ బాబూరావు, 600 మంది వైద్యులు పాల్గొన్నారు.

గురువుల ఆరాధనోత్సవాలు



లలితాపీఠంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో గురువుల ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లలితాపీఠం ద్వితీయ పీఠాధిపతి అవ్యక్తానంద మహరాజ్ జయంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఈ ఆరాధనోత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శనివారం పీఠం ఆవరణలోని అవ్యక్తానంద మహరాజ్ విగ్రహానికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి స్వయంగా పూజలు చేసి, అనంతరం భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం పీఠంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన నియోజకవర్గంలో సుమారు రూ. 3.58 కోట్ల జీవీఎంసీ నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. 31, 33, 34, 36, 37, 38 వార్డుల్లోని గొల్లలపాలెం, చాకలి గెడ్డ, బొమ్మన బ్యాక్ సైడ్, గంగుల గెడ్డ , భూపేష్ నగర్, నాయుడమ్మ ఫంక్షన్ హాల్ రోడ్డు, అల్లిపురం ఎస్సీ కాలనీ రోడ్, బౌడారా రోడ్డు కొబ్బరి తోట, మంథా వారి వీధి, మార్కెట్ మెయిన్ రోడ్, రంగిరీజు వీధి, సున్నపు వీధి, పంజా జంక్షన్, కనకమహాలక్ష్మి టెంపుల్, గోషా ఆస్పత్రి, కొత్త అగ్రహారం, కొత్త జాలారి పేట, గొల్ల వీధి తదితర ప్రాంతాలలో సిమెంట్ రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణాలు, మరమ్మతులు, బోర్లు, పార్కుల పునరుద్ధరణ, కాంపౌండ్ వాల్స్, ఆర్చి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, ఆయా వార్డుల కార్పొరేటర్లు బిపిన్‌కుమార్ జైన్, మేరీ జోన్స్, చెన్నా జానకిరామ్, గోడే విజయలక్ష్మి, జెడ్డీ మల్లయ్య నాయుడు, కార్యనిర్వాహక ఇంజినీరు యు.ఎన్.నరసింగరావు, ఉప కార్య నిర్వాహక ఇంజినీరు వెంకటేశ్వరరావు, ఏఎంవోహెచ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల పరిరక్షణకు గళమెత్తిన మేధావి వర్గం



మేధామథనం సదస్సులో పాల్గొన్న మేధావి వర్గం

సీతంపేట: గ్రంథాలయాలు జ్ఞానం, విజ్ఞానం అందించడమే కాకుండా మానవ పురోగతికి దోహదపడతాయని మాజీ వీసీ ఆచార్య కె.ఎస్.చలం అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ దిశ, ప్రజల కర్తవ్యం' అనే అంశంపై మేధామథనం పేరిట నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో హిందీ తర్వాతి స్థానంలో ఉన్న తెలుగులో పుస్తకాల ప్రచురణ తగ్గుతోందని, పబ్లిషింగ్ సంస్థలు కూడా మూతపడుతున్నాయని చెప్పారు. కేరళలోని గ్రంథాలయాల నిర్వహణ తీరును వివరిస్తూ, మన రాష్ట్రంలో వెనుకబాటుతనాన్ని తెలియజేశారు. గ్రంథాలయాల పరిరక్షణకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ప్రజలను సమాయత్తం చేయాలన్నారు. ప్రజల నుంచి సెస్ వసూలు చేస్తున్నా.. లైబ్రరీలకు నిధులు విడుదల చేయట్లేదన్నారు. ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల వెనుకబాటు వల్ల సమాజానికి కలిగే నష్టాన్ని వివరించారు. మాజీ వీసీ రొక్కం సుదర్శన్ మాట్లాడుతూ మానవ అభివృద్ధికి నాంది పలికే గ్రంథాలయాలను ప్రజల ఆస్తిగా భావించాలన్నారు. జీవీఎంసీ నుంచి గ్రంథాలయాలకు రూ.117 కోట్లు బకాయి ఉందని తెలిపారు. మాజీ వీసీ ఆచార్య హెచ్.లజపతిరాయ్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లో చదువుకునేలా అలవాటు చేయాలన్నారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఫౌండర్ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాల విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా ఉందో చెప్పాలన్నారు. ఆచార్య జి.నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ రీజనల్ లైబ్రరీ దీనావస్థను వివరించారు. యువతను భాగస్వామ్యం చేసి ఉద్యమం నడపాలన్నారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి, సాహితీవేత్త నల్లి ధర్మారావు, డి.వి.సూర్యారావు, పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ, సాహితీవేత్తలు మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, కె.నరసింహం, ఉప్పల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు నేడు

సీతంపేట: ఏఆర్‌కే రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం రామా టాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి వి.సృజన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి జరిగే సదస్సులో ఆసక్తి గల వారు పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.